



కర్నూలు నగరంలో కురుస్తున్న వర్షం

కొనసాగుతున్న గోల్డ్ మైనింగ్

- పోరాటంతో రైతులకు దక్కిన లీజు అమౌంట్ - టన్ను మట్టి నుంచి 1.5 నుంచి 2 గ్రాముల బంగారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రైతులు చేసిన పోరాటం వల్ల కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారం తవ్వకాల కోసం జియో మైసూర్ సంస్థకు భూములు ఇచ్చిన రైతులకు లీజు డబ్బులు అందడంతో బంగారు మైనింగ్ కొనసాగుతోంది. భూములు తీసుకున్న తర్వాత ఐదు సంవత్సరాలకు సంబంధించి లీజు మాత్రమే ఆ సంస్థ చెల్లించింది. తవ్వకాలు ప్రారంభం కాలేదనే పేరుతో లీజు చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. 2023 ఫిబ్రవరి నుంచి తవ్వకాలు ప్రారంభమైనా లీజు బకాయిలు మాత్రం చెల్లించడం లేదు. దీంతో, రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళన చేయడంతో 2023 మార్చి నుంచి లీజు చెల్లిస్తున్నారు. గోల్డ్ మైనింగ్ ద్వారా టన్ను మట్టి నుంచి 1.5 నుంచి 2 గ్రాములు బంగారం ఉత్పత్తి అవుతుంది. మట్టి నుంచి ముడిసరుకును వేరుచేసి ఇతర ప్రాసెస్ పనులు పూర్తి చేయడానికి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోంది. తుగ్గలి, మద్దికెర మండలాల్లో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ 2004లో నిర్ధారించింది. దీంతో మైనింగ్ రంగంలో విదేశీ పెట్టుబడులకు కేంద్రం అనుమతి ఇచ్చిన తర్వాత 2005లో జియో మైసూర్ సంస్థ తుగ్గలి మండలం జొన్నగిరిలో గోల్డ్ మైనింగ్ నిర్వహణకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకుంది. అప్పటి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఇందుకు అనుమతులు మంజూరయ్యాయి. 2014లో ఇందుకు సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభించింది. 2006లో 700 మంది రైతుల నుంచి 1500 ఎకరాలను లీజుకు తీసుకుంది. ఎకరాకు ఏటా రూ.18,500 లీజు చెల్లించడానికి ఒప్పుకుంది. తొలి మూడేళ్ళ రైతులకు సక్రమంగానే లీజు చెల్లించింది. ఆ తర్వాత నుంచి లీజు చెల్లించడం మానేసింది. రైతులు పెద్ద ఎత్తున ఒత్తిడి చేయడంతో గత దసరాకు రెండు సంవత్సరాల లీజు మొత్తాన్ని చెల్లించింది. ఆ తర్వాత నుంచి మళ్లీ లీజు చెల్లించలేదు. దీంతో రైతులు మైనింగ్ పనులను అడ్డుకున్నారు. గతేడాది మార్చి నుంచి లీజు చెల్లించడంతో మైనింగ్ పనులు తిరిగి ప్రారంభం అయ్యాయి.



బంగారాన్ని మట్టిని వేరు చేసే యంత్రాలు

రైతుల నుంచి భూముల కొనుగోలు

మొత్తం 1500 ఎకరాల్లో 150 ఎకరాలను రెండు నెలల క్రితం కొనుగోలు చేసింది. ఎకరా ఒక్కంటికీ రూ.13 లక్షలు చెల్లించింది. మిగతా 1350 ఎకరాలకు సంబంధించి 630 మంది రైతులకు లీజు చెల్లించ లేదు. జియో మైసూర్ పేరు మీద లీజు ఉండడంతో రైతులు ఆ భూముల మీద బ్యాంకుల్లో రుణాలు తీసుకునే అవకాశం కూడా లేకుండాపోయింది. ఆ భూముల రైతులకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు కూడా పొందే వీలులేకుండా అయింది. కంపెనీలో ఉద్యోగం ఇస్తామని, లీజు చెల్లిస్తామని, గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పడంతోనే కంపెనీకి భూములు ఇచ్చామని, ఇప్పుడు లీజు చెల్లించకపోవడంతో తమకు భూమిపై ఆదాయం లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ సంస్థలో అప్పట్లో చెప్పింది.

జిల్లాలో విస్తారంగా వర్షం

- సాధారణ వర్షపాతం కు మించి కురిసిన వర్షం
- విత్తనాన్ని సిద్ధం చేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్

జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గతనెల తీవ్ర వేడితో ఉక్కపోతతో ఉన్న ప్రజలకు నాలుగు రోజులుగా చల్లటి వాతావరణం ఉపశమనం కలిగించింది. చాలా గ్రామాల్లో పొలాల నిండా నీటితో నిండాయి. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాన్ని విత్తుకు సిద్ధంగా పెట్టారు. ఖరీఫ్ సాధారణ సాగు 4,19,219 హెక్టార్లుగా నిర్ణయించారు. పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, ఉల్లి,మిరప తదితర ప్రధాన పంటలు జిల్లాలో అధికంగా సాగు చేస్తారు. 2024 పంట కాలానికి సంబంధించి జిల్లాకు 15,218 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు కేటాయించారు. 13,929 క్వింటాళ్ల వేరుశనగ, 129 క్వింటాళ్ల జీలుగలు, 25 క్వింటాళ్ల పిల్లిపెసర, ఆర్బికేల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. వేరుశనగ క్వింటం పూర్తి ధర రూ.9500 అయితే రాయితీ పోను రూ.3800, రైతు చెల్లించాల్సిన క్వింటం ధర 5700 , ఇందులో 40 శాతం రాయితీ కల్పించారు. జీలుగలు క్వింటం 8800 అందులో 4400 రాయితీ ఇవ్వగా 4400 రైతు ధర చెల్లించాలి.50 శాతం రాయితీ ఇచ్చారు. పిల్లిపెసర క్వింటం ధర రూ.13400 ,రాయితీ ఇచ్చింది 6700 , రైతు చెల్లించాల్సిన ధర రూ.6700 ఇందులోనూ 50 శాతం రాయితీ ఇచ్చారు. ఈ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని పొందాలని వ్యవసాయ అధికారులు తెలిపారు.

శుక్రవారం నమోదయిన వర్షపాతం వివరాలు మంత్రాలయం 49.6,నందవరం 42.6, కౌతాళం 42.0, హోళగుంద 31.2,ఆదోని 26.4,గోనెగండ్ల 25.4, ఎమ్మిగనూరు24.2, కోసిగి 22.8, సి.బేలగల్ 20.4, పెద్దకడుబూర్ 10.2, అస్పరి 9.4, కోడుమూరు7.8, హాలహర్వి 6.8, దేవనకొండ 5.4,కల్లూరు 4.4, క్రిష్ణగిరి 2.8, గూడూరు 2.2, ఓర్వకల్ 2.2, చిప్పగిరి 2.0 పత్తికొండ 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మే నెలలో సాధారణ వర్షపాతం 40.1 మిల్లీమీటర్ల కాగా ప్రస్తుతం 712.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దాదాపు 81 శాతం అధికంగా నమోదు అయింది. దీనితో జిల్లాలో రైతులు నైరుతి రుతుపవనాల పై ఆశలు చిగురించాయి. కర్నూలు నగరంలో భారీగా ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల కాలువలు పొంగి పొర్లాయి. కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలిక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటిని మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని జిల్లా అధికారులను ప్రజలు కోరారు.

రోడ్లపై మురుగునీరు పారుతున్నా స్పందించరేంటి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వందలాది వాహనాలు, వేలాదిమంది ప్రజలతో ఎప్పుడూ రద్దీగా ఉండే బళ్లారి చౌరస్తా రోడ్డుపై మురికి నీరుప్రవహించడం మురుగుతో కలిసిన మట్టి రోడ్డుపై పేరుకొని పోవడం వల్ల ప్రయాణికులు అడుగుదీసి అడుగుపెట్ట లేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలు నరకం అనుభవిస్తున్నా...నగరపాలక సంస్థ అధికారులు పన్నులు పెంచడంపై చూపిస్తున్న శ్రద్ధ పారిశుధ్యం మెరుగుపరచడంపై లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎన్.పీటర్, సివివర్మ విమర్శించారు. బళ్లారిచౌరస్తా సమీప కాలనీల అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. జిల్లా ముఖద్వారం బళ్లారి చౌరస్తాలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ.. మురుగుతో నిండిన మట్టి రోడ్డుపై వేరుకుపోయి దుర్వాసనతో వాంతులు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం పరిచారన్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు, కాలువలు చిన్నపాటి చెరువుల్లాగా తయారైనా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు బాగున్న కాలువలను, కల్వర్టులను కూలగొట్టి, రోడ్లపై రోడ్లు వేస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం కోసం నిర్మాణాలు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో చౌరస్తా సమీప కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు కె.గోపీనాథ్, ఎన్. పరమేష్, వెంకట్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

ఇన్‌పుట్ సబ్సిడీని రైతుల ఖాతాల్లో

తక్షణమే జమచేయాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత సంవత్సరం ఖరీఫ్, రబి సీజన్‌లో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్లో వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని కొన్ని ప్రాంతాలలో అధిక వర్షాల వల్ల వేసిన పంటలు దెబ్బతిని పంటలు నష్టపోయి నరైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇంతవరకు రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు రాయలసీమ ప్రాంతంలో , కోస్తా ప్రాంతంలో వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కొన్ని పంటలను దునేశారని, వేసిన పంటలు సరైన దిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్టపోతే రైతులు చేసిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఏమాత్రం కరువు సహాయక చర్యలు చేపట్టలేదనానరు. ఇప్పటివరకు ఒక్క పైసా నష్టపరిహారం కింద రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఎన్నికల ముందు లబ్ధి పొందేందుకు కోర్టు ద్వారా ఉత్తరువు తెచ్చుకొని హడావుడి చేసి ఇన్‌పుట్ సబ్సిడీ వేస్తామని అన్నారు.అయితే ఎన్నికల కమిషన్ అంగీకరించకపోవడం చేత రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఎన్నికల అయిన వెంటనే రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయమని ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, ఎన్నికల అయిపోయి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ ప్రభుత్వ నుండి ఏమాత్రం స్పందన కనిపించడం లేదని, వెంటనే కరువుతో నష్టపోయిన రైతులందరినీ ఆదుకునేందుకు రైతుల ఖాతాల్లో ఇన్పుట్ సబ్సిడీని జమ చేయాలని డిమాండ్ చేశారు.



జలమయమైన లోతట్టు ప్రాంతాలు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో శుక్రవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై ఇండ్లలోకి నీరు చేరింది. ప్రధానంగా లక్ష్మీ నగర్ శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లోని నీరు రోడ్లపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షం పడిన ప్రతిసారి ఈ ప్రాంతం జలమయం అవడానికి కారణం కెసి కెనాల్ నుండి అండర్‌గ్రౌండ్ ద్వారా మరుగునీరు పోయే దారి ఉంది. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జనాభా పెరిగింది ఇండ్లు పెరిగాయి. అంతేగాక కాలువ వెంట ఇండ్లను నిర్మించడంతో కాలువలో నీరు ఒక అండర్ టెన్నల్ ద్వారా నీరు వేగంగా పోయే దారి లేక వీధులన్నీ మొరుగునీటితో జలమయమైపోతున్నాయి. వర్షం పడినప్పుడల్లా అధికారులు వచ్చి తాత్కాలికంగా పనులు చేయడం తప్ప శాశ్వత పనులు చేయడం లేదని అక్కడ ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో భారీ వర్షం కురిసినట్లయితే ఇళ్లలోకి నీరు చేరి జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అధికారులు స్పందించి శాశ్వత పనులు చేసి మురుగునీరు నిలవకుండా వెళ్ళిపోయే విధంగా కాలువలు నిర్మించాలని ప్రజలకు కోరుతున్నారు.



ఇవిఎం స్ట్రాంగ్ రూముల సందర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి , కర్నూలు నగరపాలక కమిషనర్ ఎ. భార్గవ్ తేజ సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత రిజిస్టర్ లో సంతకం చేశారు.



మెడికవర్ హాస్పిటల్స్ అవగాహనకార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ చైతన్య, తదితరులు

మెడికవర్‌లో హైపర్ టెన్షన్ పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆహార నియమాలు, వ్యాయామం వంటి తగిన జాగ్రత్తల వల్ల రక్తపోటును అదుపులో పెట్టుకోవచ్చని మెడికవర్ వైద్యులు సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సు డాక్టర్ ఎన్.చైతన్య కుమార్, డాక్టర్ బిఎస్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ సిఎస్. తేజ నందన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో దీర్ఘకాలిక సమస్యలు బాగా ఎక్కువై పోతున్నాయన్నారు. వాటిల్లో బిపి కూడా ఒకటి. బిపి అనేది ఒక్కసారి వచ్చిందంటే. జీవితంలో మళ్లీ తగ్గదు. కేవలం పెరగకుండా మాత్రమే మనం కంట్రోల్ చేసుకుంటూ ఉండాలి. అధిక బిపి వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ బిపి వల్ల చాలా మంది హార్ట్ ఎటాక్‌కి గురై చనిపోతున్నారని, అందుకే ఇలాంటి సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.బిపిని కేవలం మందులతోనే కాకుండా సరైన ఆహారంతో కూడా తగ్గించుకోవచ్చున్నారు. హైపర్‌టెన్షన్ లక్షణాలు, చికిత్స, జాగ్రత్తలపై వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. మహేశ్వర్ రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కర్నూలు కమిషనర్ ఎ.భార్గవ్‌తేజ

అసిస్టెంట ట్రైనీ కలెక్టర్‌కు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్ల కళ్యాణి కర్నూలు నగరపాలక సంస్థలో అన్ని విభాగాలపై అవగాహన పెంచుకునేందుకు జిల్లా కలెక్టర్ జి. సృజన కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఈ నెల 17 నుంచి 31 వరకు మునిసిపల్ శాఖ , పట్టణ పరిపాలన పై క్షుణంగా పూర్తి అవగాహనా కల్పించాలని, నగర పాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. అందులో భాగంగా ఈనెల 17నుంచి 31 వరకు అన్ని విభాగాల అధిపతుల ద్వారా పూర్తిగా అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు.

అధిక రక్తపోటు పై అవగాహన అవసరం

ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ మీ ఖచ్చితమైన బిపిని తెలుసుకోవాలని ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు. శుక్రవారం కర్నూలు శ్రీరామ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అంతర్జాతీయ హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) దినోత్సవాన్ని కర్నూలు మెడికల్ కాలేజ్ మెడిసిన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ 35 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఖచ్చితమైన రక్తపోటును తెలుసుకోవాలని, దాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవాలన్నారు. తద్వారా ఎక్కువ కాలం జీవించాలని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే వుందని అశ్రద్ధ వహించరాదని అన్నారు. 35 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరు ప్రతి ఆరు నెలలకు ఒకసారి అవసరమైన అన్ని ఆరోగ్య పరీక్షలు విధిగా చేయించుకోవాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వైష్ణవి, డ్కార్ నాగరాజు మాట్లాడుతూ ఆహార పదార్థాల్లో ఉప్పు తక్కువగా ఉపయోగించాలని, శారీరక శ్రమ ఉండాలని, బిపి మందులను క్రమం తప్పకుండా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి నాయక్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అలీ, మెడికల్ ఆఫీసు డాక్టర్ దివ్య, లెక్చరర్ సురేష్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముగుడు, హెల్త్ సూపర్‌వైజర్లు సాయి, మాధవ రాజు, బాగ్యమ్మ, సుభాషిణి, పి.జి లు, హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో....

ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినం సందర్భముగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు వలన ఆరోగ్యానికి చేటు అని తెలిపారు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

అధిక రక్తపోటు కు కారణాలు: మానసిక వత్తిడి, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లు , వంశ పారంపర్యం, మద్యపానం, ధూమపానం , ఆహారంలో ఉప్పు అధికంగా తీసుకోవడం.

నివారణ చర్యలు: ఆహార నియమాలు పాటించాలి , క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఆహరంలో ఉప్పు తగ్గించు కోవాలి, తరచుగా రక్తపోటు పరీక్ష చేయించుకోవాలి, యోగా, మెడిటేషన్ చేయాలన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ వై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందికి రక్తపోటు పరీక్షలు చేసి , అధిక రక్తపోటు ఉన్నవారికి ఆహార నియమాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఒఆర్ఎస్ బికె హేమలత, డిపిఎంఒ డాక్టర్ ఉమా, డెమో ప్రమీలాదేవి, డిపిహెచ్ ఎన్ఒ ఇందిర, ఎస్ఒ హేమసుందరం, డిస్ట్రిక్ట్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్, డిపిఒ విజయరాజు, హెచ్ఇఒ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రసేఖర్ రెడ్డి, పిఒనరేష్ , ప్రాజెక్సనిస్ట్ ఖలీల్, ప్రభుత్వ ఎంపిహెచ్‌డబ్ల్యుఎఫ్ ట్రైనింగ్ సెంటర్ భోదనా సిబ్బంది, విద్యార్థినులు, ఎంఎల్‌హెచ్ పి లు, ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రదర్శనలో డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

మార్కెట్ యార్డ్ కార్మికులకు సిపిఎం అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన డి.గౌస్ దేశాయ్ తరుపున కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ కార్మికులు వారి నివాస ప్రాంతాల్లో నెలరోజులపాటు ఎన్నికల ప్రచార చేశారు. ప్రచారంతో పాటు సిపిఎంకు రూ.40 వేల విరాళం ఇచ్చారు. సంవత్సరం నుండి వచ్చిన కూలి నుండి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె .ప్రభాకర్ రెడ్డి, నగర సిఐటియు నాయకులు టి. రాముడు ,ఆర్. నరసింహులుకు రూ.40 వేలు ఎన్నికల విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ హమాలీ యూనియన్ నాయకులు యు.బీసన్న, బి.రామకృష్ణ , నాగన్న, కేశవులు, మధు, కిట్టూ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్మికులు ఎంతో చైతన్యంతో ఈ ఎన్నికల్లో పనిచేశారని, అలాగే పార్టీకి ఆర్థికంగా అండగా నిలిచినందుకు వారిని అభినందించారు. ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.




సిపిఎం కు విరాళం అందజేస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీలు

చంద్రబాబును కలిసిన టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కర్నూలు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి టిజి భరత్ కలిశారు. చంద్రబాబును కలిసి ఎన్నికల పోలింగ్ గురించి చర్చించినట్లు టిజి భరత్ చెప్పారు. ఈ సందర్భంగా కర్నూలు నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేసినట్లు చంద్రబాబుకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టబోతుందని చంద్రబాబు నాయుడు చెప్పారని టిజి భరత్ అన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్చం అందజేస్తున్న టిజి.భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ రవికుమార్

వేసవి దుక్కిదున్నడం రైతుకు మేలు : ఎఒ

ప్రజాశక్తి-మద్దికేర

వేసవిలో భూమి దున్నుకోవడం వల్ల రైతుకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన మద్దికేర వ్యవసాయ ఆఫీసులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దికేర మండలంలో గత వారం రోజుల్లో 9.6 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయిందని, ఈ వర్షపాతం వేసవి దుక్కులు దున్నుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. రైతులు తమ భూములను వాలుకు అడ్డంగా లోతుగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు ఇంకీ భూమి సాగకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు తమ పొలంలో పడిన వర్షపు నీటిని భూమిలో ఇంకుపోయేవిధంగా చేసుకోవాలన్నారు. వేసవిలో దుక్కి దున్నుకోవడం వలన నేల పొరలలో కోశస్తా దశల్లో ఉన్న కీటకాలు ఎండ బారిన పడి నశిస్తాయన్నారు. గడ్డి మొక్కలైన తుంగ, గిరికా, వంటి దుంపలను ఏరి వేస్తే కలుపును సమర్థవంతంగా నివారించుకోవచ్చున్నారు. మెట్ట పొలాలకు వీలైనంత పశువుల ఎరువును వేసుకొని కలియదున్నడం వలన వర్షపు నీరు ఇంకీ సేంద్రీయ కర్బనం పెరిగి నీరు నిల్వ అవుతుందని పేర్కొన్నారు. ఎకరాకు రెండు ట్రాక్టర్లు పశువుల ఎరువు వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ షాప్ డీలర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


ఫెస్టిసైడ్ దుకాణాల వద్ద రైతుల సందడి

తొలకరి పలకరింపు

- ఫెస్టిసైడ్ దుకాణాల వద్ద రైతుల సందడి

- ఎరువులు, విత్తనాల కొనుగోలులో నిమగ్నం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

తొలకరి వర్షాలు పలకరించాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో వర్షాలు ప్రారంభమయ్యాయి. మొన్నటి దాకా వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షపు జల్లులతో సేదతీరుతున్నారు. రుతుపవనాల రాకతో తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రైతులు దుక్కులను సిద్ధం చేసుకోవడంతో పత్తి, జొన్న తదితర విత్తనాలు విత్తుకుంటున్నారు. వరి సాగు చేసే రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. తొలకరి పలకరింపుతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నుకున్న రైతులు అక్కడక్కడ పత్తి, జొన్న విత్తనాలు వేస్తున్నారు. ఈఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గటుగానే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు.

సమృద్ధిగా ఎరువులు, విత్తనాలు..

వర్షాలు కురుస్తుండడంతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచారు. వర్షాకాలానికి ముందే అధికారులు జిల్లావ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఏయే పంట ఎంత విస్తీర్ణంలో వేస్తారనే అంచనాతో ఇండెంట్ తయారు చేసుకున్నారు. రోహిణికార్తెలో దుక్కులు సిద్ధం చేసుకున్న కొంతమంది రైతులు పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. మరో రెండు వర్షాలు కురిస్తే భూమిలో వేడి తగ్గుతుందని, అప్పుడు విత్తుకుంటే త్వరగా మొలకెత్తి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మండలంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కౌతాళం


పొలాల్లో నిలిచిన నీరు

మండలంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వేసవి వేడి నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. మండలంలోని కామవరం, ఉరుకుంద, చూడి, హాల్వి, రౌడూరు, ఉప్పరహాలు, కుంటనహాలు, ఎరిగేరి, బాపురం, కాత్రికి ఆయా గ్రామాల్లో వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఖరీఫ్ సీజన్ పనులు చేసుకోవడానికి అనుకూలంగా మారిందని రైతులు తెలిపారు. మండలంలో 42 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని గణాంకాల అధికారి కౌసర్ తెలిపారు.

లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

- ఎడిఎ విజయమోహన్, ఎఒ సురేష్‌బాబు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో లైసెన్స్ లేకుండా దుకాణదారులు పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఎడిఎ విజయ మోహన్, ఎఒ సురేష్ బాబు హెచ్చరించారు. శుక్రవారం దేవనకొండలో విత్తన దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీడ్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే పత్తి విత్తనాలను విక్రయించాలని తెలిపారు. ఏ కంపెనీకి సంబంధించిన సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకపోతే సీజ్ చేస్తామని, బిల్స్ తప్పకుండా రైతులకు ఇవ్వాలని సూచించారు. ఎంఆర్‌పి కంటే ఏ రైతుకు అధిక ధరలకు విక్రయించరాదన్నారు. రైతులు ఎవరూ లూజు విత్తనాలు తీసుకోరాదని సూచించారు. మండలంలో మేనెల సాధారణ వర్షపాతం 44 సెంటీమీటర్లకు గాను ఇప్పటికే 35 సెంటీమీటర్ల వర్షపాతం కురిసిందని తెలిపారు. జూన్ మొదటి వారంలో రైతులు ఎక్కువగా పత్తి విత్తనాలు సాగు చేస్తారని, అవసరమైన మేర పత్తి విత్తనాలు, ఆర్‌బికెలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.


పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

వర్షం రాకతో చల్లబడ్డ వాతావరణం

- జలమయమైన పల్లపు ప్రాంతాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పరిసర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజామున విస్తారంగా వర్షం కురిసింది. వర్షం రాకతో వాతావరణం చల్లబడిందని పలువురు పేర్కొంటున్నారు. మార్చి, ఏప్రిల్ మాసంలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మే మాసం రెండో వారం నుంచి అడపాదడపా వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం కలిగినట్లు ఉందని పలువురు పేర్కొంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం వల్ల ఆదోని శివారులోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ మైదానంలో వర్షపు నీరు నిలిచి ఉండడం వల్ల ఉదయం వాకింగ్, జాగింగ్ చేసే వారికి కొంత ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది.

మైదానం చదును పనులు అంతంతే

మున్సిపల్ మైదానం చదును పనుల కోసం నాడు-నేడు కింద రూ.20 లక్షలు గతంలో ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో గ్రావెల్ వేసి బయట నీరు మైదానంలోకి రాకుండా కాల్వ ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాంటి పనులేమీ చేయకపోవడంతో బయట మురుగునీరు మైదానంలోకి వస్తోంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఎలాంటి అవకాశాలూ లేకపోవడంతో చెరువును తలపిస్తోంది. కనీసం నీటిని బయటకు తోడేందుకు కూడా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. మైదానమంతా పాచి పట్టి దుర్వాసన వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

ఇబ్బందులు పడ్డ ఉద్యోగులు

పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ 21వ వార్డు సచివాలయం జలమయమైంది. వర్షపు నీరు భవనం ముందు నిలిచి ఉండడంతో అందులోకి వెళ్లేందుకు ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గత్యంతరం లేక మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లి కార్యాలయంలో విధులు నిర్వర్తించారు. భవనం ముందు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని కార్యకలాపాల కోసం వచ్చిన స్థానికులు వాపోతున్నారు.


21వ వార్డు సచివాలయం ముందు నిలిచిన వర్షపు నీరు

ఈఎస్‌ఐ ఆస్పత్రి రైల్వే ట్రాక్ రోడ్డు నుంచి గర్ల్స్ హైస్కూల్‌కు వచ్చే రహదారి అధ్వానంగా మారింది. అక్కడ ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలవడం వల్ల రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతల లోతు తెలియక కొందరు అదుపుతప్పి ద్విచక్ర వాహనదారులు కిందపడిన సందర్భాలూ ఉన్నాయి. కనీసం నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డిని పలువురు కోరారు.

రైల్వే ట్రాక్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


స్పందించిన మున్సిపల్ కమిషనర్ : రోడ్డులోని గుంతలో నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన జెసిబి ద్వారా కాలువలు తీయించారు. రోడ్డుపై నిలిచిన నీరు బయటకు వెళ్లడంతో రాకపోకలకు అనుకూలంగా మారిందని వాహనదారులు తెలిపారు.

డివిజన్‌లో వర్షపాతం వివరాలు

ఆదోని డివిజన్ మొత్తం 274.4, సగటు 30.5 మిల్లీమీటర్ల వర్షపాతం శుక్రవారం నమోదైందని అధికారులు తెలిపారు. ఆదోని 26.4, హోళగుంద 31.2, పెద్దకడబూరు 10.2, ఎమ్మిగనూరు 24.2, నందవరం 42.6, గోనెగండ్ల 25.4, మంత్రాలయం 49.6, కోసిగి 22.8, కౌతాళం 42.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ఇళ్లలో నీరు చేరి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

వీరంపల్లిలో తిరుణాల ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వీరంపల్లి గ్రామంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, మహాలక్ష్మీ గోవిందమాంబ 28వ తిరుణాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త విశ్వబ్రాహ్మణ సంజీవయ్య ఆచారి తెలిపారు. శుక్రవారం ఉదయం పూజ, అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభించామని, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. 18న ఉదయం 8.45 గంటలకు గ్రామోత్సవం, 11.35 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరుగు పందెం, బండలాగుడు పోటీలు

19న ఉదయం పరుగు పందెం పోటీలు, మధ్యాహ్నం రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరుగు పందెంలో గెలుపొందిన వారికి రూ.2,016, రూ.1,516, రూ.1,016, బండలాగుడు పందెంలో గెలుపొందిన వారికి రూ.20,016, రూ.15,016, రూ.10,016 నగదు బహుమతులు అందజేస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలకు 9949101986 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



ఉరుకుందలో టెండర్లు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానానికి సంబంధించి వివిధ టెండర్లను శుక్రవారం నిర్వహించారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ మాట్లాడుతూ... సీల్డ్ టెండర్లలో శ్రీస్వామివారి శేష వస్త్రాలు సరఫరా చేసేందుకు ఇద్దరు టెండర్లు వేసినట్లు తెలిపారు. వారిలో అపూర్వ శారీస్ (ఆదోని), సుస్మిత శారీస్ (ఆదోని) వారు టెండర్ వేసుకున్నారని చెప్పారు. వంట చెరకు సరఫరా చేసేందుకు ఇద్దరు టెండర్లు వేసినట్లు తెలిపారు. వారిలో మల్లికార్జున సా మిల్, (కోసిగి), విశ్వకర్మ టింబర్ డిపో (ఆదోని) వారు టెండరు వేసినట్లు చెప్పారు. దేవస్థానం భూముల బహిరంగ వేలంలో ఉరుకుంద సర్వే నెంబరు 386కు (విస్తీర్ణం 1.58) రూ.5,700 నర్సన్న, ఉరుకుంద సర్వే నెంబరు 131కు (విస్తీర్ణం 2.67) రూ.25,100 రామన్న గౌడ్, ఉరుకుంద సర్వే నెంబరు 315కు (విస్తీర్ణం 1.13) రూ.4 వేలు ఉసేని వారు హెచ్చు పాటదారులుగా దక్కించుకున్నట్లు తెలిపారు. పెద్దహరివాణం సర్వే నెంబరు 634సికి (విస్తీర్ణం 1.00) పాటదారులు హాజరు కానందున వాయిదా వేసినట్లు చెప్పారు. పిసి.రాంప్రసాద్ గ్రేడ్-1 ఇఒ, గ్రూప్ టెంపుల్స్ ఆదోని దేవస్థాన పర్యవేక్షకులు మల్లికార్జున, రాంప్రసాద్, వెంకటేష్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.


టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

హజ్ యాత్రికులకు ఘన వీడ్కోలు


హజ్ యాత్రకు బయల్దేరుతున్న యాత్రికులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ముస్లింల పవిత్ర మక్కా యాత్ర హజ్‌కు మండలం నుంచి ఈఏడాది ఐదుగురు హాజీలు ఎంపికయ్యారు. గోనెగండ్లకు చెందిన లైన్‌మేన్ దాదావలీ, వహీదా దంపతులు, కొట్టం అజీజ్ మియా, గంజిహళ్లి గ్రామానికి చెందిన వలీ, కులుమాల వలీ శుక్రవారం హజ్ యాత్రకు బయల్దేరి వెళ్లారు. ఉదయం నమాజ్ అనంతరం గ్రామంలోని ముస్లిం లందరూ వీరిని సంత బజారులోని జామియా మసీదు నుంచి పాత బస్టాండ్ వరకు సాగనంపారు. తమ గ్రామం నుంచి హాజీలు చేపట్టిన హజ్ యాత్ర ఎలాంటి ఆటంకాలూ లేకుండా విజయవంతం కావాలని కోరుతూ ఘనమైన వీడ్కోలు పలికారు. ఎంపిపి నసురుద్దీన్, హాఫీజ్, అబ్దుల్ రెహమాన్, రఫీక్, షకీల్, హాజీ అబ్దుల్ జలీల్, ఉస్మాన్, అల్లాబకాష్ పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న భూపాల్‌రెడ్డి

మఠంలో జిల్లా అదనపు జడ్జి భూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్నూలు జిల్లా అదనపు జడ్జి భూపాల్ రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి ఎస్ఐ గోపినాథ్ తగిన భద్రత కల్పించారు.

ఆత్మహత్య నుంచి యువకుని కాపాడిన పోలీసులు


ధనుంజయకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఆదోని

ఆత్మహత్య చేసుకోబోతున్న ధనుంజయ అనే యువకుని పోలీసులు కాపాడిన సంఘటన ఆదోనిలో శుక్రవారం చోటు చేసుకుంది. త్రీటౌన్ సిఐ నరసింహరాజు, ఎస్ఐ నాగేంద్ర వివరాల మేరకు... ధనుంజయ ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి వెళ్లి పోయాడని పోలీసులకు కుబేర రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శివనారాయణ స్వామి, సిఐ నరసింహ రాజు ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో అంజినేయ స్వామి విగ్రహం వద్ద బహిరంగ ప్రదేశంలో బైక్, వ్యక్తి ఉన్నాడని సమాచారం వచ్చింది. అక్కడికి వెళ్లి గమనించి ధనుంజయగా నిర్ధారించుకొని కౌన్సెలింగ్ ఇచ్చి, పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి బంధువులకు అప్పగించారు. ధనుంజయను కాపాడిన త్రీ టౌన్ పోలీసులకు బంధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

లోపించిన పరిశుభ్రత..!

- మురుగు కాలువలు అస్తవ్యస్తం - సీజనల్ వ్యాధులతో మంచం పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గ్రామాల్లో పరిశుభ్రత లోపించింది. మురుగు కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దోమలు వ్యాప్తి చెంది, దుర్వాసనతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

మండలంలోని పెద్దతుంబలం, మండగిరి, పెద్దహరిహణం, బైచిగేరి, సలకలకొండ, ఇస్వి, జాలమంచి, నాగలాపురం, నాగనాథనహళ్లి, ఢణాపురం, కుప్పగల్, నెట్టేకల్, సాంబగల్, పెద్దపెండేకల్, సంతేకుడ్లూరు, మాంత్రికితో పాటు మరికొన్ని గ్రామాల్లో పరిశుభ్రత లోపించింది. పారిశుధ్య లోపం కారణంగా ప్రజల్లో సీజనల్ వ్యాధుల భయం పట్టుకుంది. రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. చాలా గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీటితో పాటు వర్షపు నీరు చేరి రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్లపై ఉన్న మురుగు నీరు ప్రవహించడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పారిశుధ్య నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా దాని అమలు ఎక్కడా కనిపించడం లేదు. పారిశుధ్య చర్యలు లేక గ్రామాలు కంపుకొడుతున్నాయి. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నినాదాలకే పరిమితమైందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రతేడాది సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, రక్షిత మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. నష్టం జరిగాక మొక్కుబడిగా పనులు చేస్తున్నారే తప్ప శాశ్వత చర్యలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లో సిసి రోడ్లు, మురుగు పోయేందుకు కాలువలు లేకపోవడంతో వర్షాకాలం వస్తే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ పరిశుభ్రత లోపించింది. ఎక్కడికక్కడే చెత్త కనిపిస్తోంది. గృహాలకు సమీపంలో, రోడ్డు పక్కన పేడ దిబ్బలు, కాలువలు లేక రోడ్లపైనే మురుగు నీటితో కంపుకొడుతున్నాయి. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలడానికి ఇదే కారణమని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీల అభివృద్ధి కేంద్రం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. సమస్యలను పట్టించుకోవడం లేదు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు

వర్షాలతో గ్రామాల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏ గ్రామానికి వెళ్లినా పరిశుభ్రత లోపం కనిపిస్తోంది. విషజ్వరాలు వణికిస్తున్నాయి. రోగాల బారినపడిన వారికి వైద్యం అందించే వారు లేక ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు ప్రతి గ్రామంలో విజృంభిస్తున్నాయి. ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు గ్రామాల్లో ఉండకపోవడంతో వైద్యసేవలు అందడం లేదనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ప్రధానంగా పరిశుభ్రత లోపంతోనే జ్వరాలు ప్రబలుతున్నాయి. పారిశుధ్య పనులు, ఫాగింగ్ చేసిన సందర్భాలు కనిపించడం లేదు. దీనిని బట్టి వైద్యసిబ్బంది ఏ మేరకు విధులు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లోని చేతిపంపులు, కుళాయిల వద్ద నీరు నిల్వ ఉండడంతో దోమల లార్వా పెరుగుతోంది. గ్రామాల్లో సరైన వైద్యసేవలు అందకపోవడంతో ఆర్‌ఎంపిలను ఆశ్రయిస్తున్నారు. వెంటనే గ్రామానికి వచ్చి వైద్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు కరువు

మండలంలోని 37 గ్రామ సచివాలయాల పరిధిలో 112 మంది గ్రీన్ అంబాసిడర్లు ఉండేవారు. వారికి సుమారు 3 నుంచి 9 నెలలకు జీతాలు పెండింగ్‌లో పెట్టడంతో వారికి జీతాలు ఇవ్వలేక 30 నుంచి 40 మంది తీసేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నినాదంతో 112 ట్రై సైకిల్ పంపిణీ చేసినా అవి ఇప్పుడు మూలనపడ్డాయి.


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పారిశుధ్య పనులు చేపడతాం

- కె.నాగరాజ్, ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి, ఆదోని మండలం



మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడతాం. పంచాయతీలో నిధుల కొరత ఉన్నప్పటికీ సర్పంచి, ప్రజాప్రతినిధుల సహకారంతో మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలని గ్రామ కార్యదర్శులకు సూచించాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

ఏరూరు రహదారి గుంతలమయం

- అడుగడుగునా కంకర తేలిన గుంతలు

- ఇబ్బందులు పడుతున్న ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

రహదారులను బాగు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెడుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు మాత్రం అధ్వానంగా తయారయ్యా యి. చిప్పగిరి మండలంలోని ఏరూరు, డేగులపాడు గ్రామాలకు వెళ్లే రహదారిలో కంకర తేలి అడుగడుగునా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి నుంచి ఏరూరు మీదుగా డేగులపాడు గ్రామానికి దాదాపు 12 కిలోమీటర్లు ఉంది. ఈ 12 కిలోమీటర్ల ప్రయాణం చేయాలంటే 30 నిమిషాల సమయం పట్టేది, దాదాపు 2 గంటలు అవుతోందని ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ గుంతకల్ డిపో నుంచి ఈ ఇరు గ్రామాలకు ఉదయం, సాయంత్రం బస్సు నడుపుతున్నారు. బస్సులో ప్రయాణించే వారంతా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గర్భిణులు, వృద్ధులు బస్సులో ప్రయాణించడానికి కూడా వెనకడుగు వేస్తున్నారు. ఈ రహదారికి వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఈ ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుంతల పడిన ఏరూరు, డేగులపాడు రహదారి


వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిని మధులీల

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - కౌతాళం

స్థానిక గ్రంథాలయంలో గత వారం రోజుల నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ అధికారిని మధు లీల నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు, తదితర అంశాలను విద్యార్థుల చేత నిర్వహిస్తున్నారు. వేసవి కాలపు విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని శుక్రవారం ఆమె తెలిపారు. విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని లాడ్జీల్లో మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాల్లో భాగంగా లాడ్జీలు వ్యభిచార గృహాలుగా మారాయని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. బాలికలు ద్విచక్ర వాహనాలపై వచ్చి అసాంఘిక కార్యకలాపాలు ముగించుకుని వెళ్తున్నారని, కొందరు మహిళలు వ్యభిచారమే వృత్తిగా కొనసాగుతున్నారని, కొందరు లాడ్జీల యజమానులు ఒప్పందపు వ్యభిచారానికి తెర లేపారని, పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు